జ్వరాల కాలం.. జరభద్రం

- ఎంటీఎంసీలో కొరవడిన పారిశుద్ధ్య నిర్వహణ
- ఎటు చూసినా చెత్తకొండలు, పారని మురుగు కాల్వలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు



మురుగు నీటిలో ఉన్న పురుగులు (ఫైల్)



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

తాడేపల్లిరూరల్: వాతావరణం మార్పులు, వర్షాల రాకతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో డ్రైనేజీలు, కల్వర్టులు, ప్రధాన రహదారుల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. ఈగలు, దోమలు ప్రభలుతున్నాయి. మంగళగిరి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నేటికీ అధికారులు ముందస్తుగా ఎటువంటి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టలేదు. దీంతో సీజనల్ వ్యాధుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిన పరిస్థితి తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కొరవడిన క్లోరినేషన్

ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అంతంత మాత్రమే వైద్య సౌకర్యాలు లభిస్తున్నాయి. పేరుకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉందని చెబుతున్నా ఆచరణలో మాత్రం శూన్యమనే చెప్పాలి. రూరల్ ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్, ఫాగింగ్ తదితర పనులు మచ్చుకైనా కానరావడం లేదు. నియోజకవర్గ పరిధిలో గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రహదారులు, డ్రైనేజీలు, ప్రధాన కేంద్రాలు, లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. దోమలు, ఈగలు ప్రభలుతుండడంతో వ్యాధులు విజృంభిస్తాయేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని వ్యాఖ్యానిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలే రక్ష..!

రోగాలు వచ్చాక బాధపడడం కంటే, ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలావరకు వ్యాధులను నియంత్రించవచ్చు. ప్రజల ఆరోగ్యం క్షీణించడానికి దోమలే ప్రధాన కారణం. వీటి వల్ల డెంగీ, మెదడువాపు, చికున్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇంటి పరిసరాల అపరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు ఉంటే దోమలు పెరిగి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది.



నిల్వ వున్న మురుగు నీటిపై దోమలు

కనీస జాగ్రత్తలు

- వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలి
- ఎప్పటికప్పుడు నీటి పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. క్లోరినేషన్ చేసిన నీటిని వినియోగించాలి
- భోజనానికి ముందుగానే చేతులు, కాళ్లు పరిశుభ్రం చేసుకోవాలి
- వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ముగురునీటి ప్రాంతాల్లో కిరోసిన్, నేఫ్తాయిల్ చల్లి దోమల లార్వాలను నాశనం చేయాలి
- ఇంటి కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- దోమతెరలు వాడాలి

జాగ్రత్తలు పాటించాలి



అందరూ ఎపిడమిక్ సీజన్‌కు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైన జాగ్రత్తలు పాటించాలి. జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీల్లో సిద్ధం చేశారు. అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నాం. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. జ్వరాలపై పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు విస్తృతంగా అవగాహన కల్పించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమతెరలు వాడాలి.

– డాక్టర్ మానస, అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యులు, డ్రైవర్స్ కాలనీ

క్లుప్తంగా

పోలీస్ శాఖకు కారు బహూకరణ



నగరంపాలెం: పోలీస్ శాఖకు కారు అప్పగించడం ఆనందాయకమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు రూ.10.50 లక్షల ఖరీదైన కారుని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు అందించారు. కారు తాళాలు, పత్రాలను జిల్లా ఎస్పీకి అప్పగించారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, తాడికొండ పీఎస్ సీఐ వాసు, చలపతి మోతడక ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగశ్రీనివాసరావు, జిల్లా ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు, ఆర్ఐ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



దుగ్గిరాల: పొగాకు వ్యతిరేక దినోత్సవంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, నిమ్మగడ్డ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 37 మంది పాల్గొనగా ముగ్గురు విద్యార్థులు ఎం.వెంకటరావు (9వ తరగతి), డి.హర్షవర్ధన్ (9వ తరగతి), ఎస్.సాత్విక్ (8వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రెహమాన్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు నోటి క్యాన్సర్‌కు కారకమవుతాయన్నారు. ఎంఈఓ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వ్యాస రచన పోటీల వల్ల విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి, సృజనాత్మకత అలవడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా మలేరియా అధికారి మురళీ సుబ్బరాయణం



దుగ్గిరాల: మలేరియా మాసోత్సవాలపై అవగాహన ర్యాలీ శనివారం దుగ్గిరాల బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా మలేరియా అధికారి మురళీ సుబ్బరాయణం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. కీటక జనిత వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి నిల్వ లేకుండా చేసినట్లయితే దోమలవ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రెహమాన్, వి.సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులు జాగ్రత్తలు పాటించాలి



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలో శనివారం నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈసందర్భంగా పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ మాట్లాడుతూ మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా 520 గొర్రెలు, వంద మేకలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. దీనిద్వారా జీవాల కడుపులో ఉన్న పేగు పురుగులు నశిస్తాయని చెప్పారు. శరీరంలోని పోషకాలు పూర్తిగా ఉపయోగించడంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. జీవాల పెరుగుదల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గొర్రెల పెంపకం దారులకు వివరించారు. మందులు ఉచితంగా అందజేశారు. పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి

వరహాపురం (వేమూరు): రోడ్ల పక్కన ఉన్న చెత్తను వెంటనే తొలగించాలని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. వేమూరు మండలంలోని వరహాపురం గ్రామంలో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని టీటీడీ యార్డు ముఠా కార్మికులను కలసి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ముఠా కార్మికులకు సంక్షేమ చట్టాలను చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పనివిధానం కోసం, కనీస వేతనాల సాధన కోసం, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ సమ్మె జరుగనుందని వివరించారు. ఈ సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు కె.శ్రీనివాసరావు, టి.వెంకటయ్య, సుబ్బారావు, శ్రీనివాసరావు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

తోపుడు బండి అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలోని ఓ చిరువ్యాపారికి గివింగ్ బ్యాక్ టు సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ సీతారామయ్య తోపుడు బండిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ ఉండవల్లి సెంటర్‌లో చిరువ్యాపారం చేసుకుని జీవిస్తున్న కుక్కల దుర్గ అద్దెబండి తీసుకుని అద్దెలు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని తోపుడు బండిని అందజేశామని తెలిపారు.

మంగళగిరి టౌన్: చాలీచాలని సంపాదనతో అద్దె బండి భారంతో ఇబ్బందులు పడుతున్న చిరువ్యాపారులకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ సహకారం అందించింది. మంగళగిరి నగరంలోని ఇందిరానగర్‌కు చెందిన దామర్ల బాబూరావుకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ సహకారంతో తోపుడు బండిని అందజేశారు. అద్దెబండి భారంతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న సొసైటీ సాయం చేయాలనే ఉద్దేశ్యంతో నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా ఈ తోపుడు బండిని బాబూరావుకు అందజేశారు.

అణగారిన వర్గాలు ఐక్యంగా పోరాడాలి

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

మంగళగిరి టౌన్: నేటి సమాజంలో అన్ని అనర్థాలకు కారణమైన ధన రాజకీయాలను ఓడించి జన రాజకీయాలను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని బీసీ సంఘ రాష్ట్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతులైన బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం, వారి అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు దశాబ్దాలుగా బీసీ సంఘాలు పోరాడుతున్నాయని అన్నారు. యాచించడం కాదు పోరాడి సాధించుకోవాలన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పిలుపునందుకుని ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన అణగారిన వర్గాలంతా సమైక్యంగా ఉద్యమించాలని, తొలి అడుగుగా ఏపీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ – అంబేడ్కర్ – పూలే ఫౌండేషన్లు సంయుక్తంగా తిరుపతిలో జూలై 6న నిర్వహించనున్న బీసీల ఆత్మగౌరవ భరోసా సభకు బీసీలంతా వేలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ముందడుగు వేసి తమ సత్తా చాటాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, విజయవాడ నగర అధ్యక్షుడు చందు, రాష్ట్ర కార్యదర్శి శివరామ్ బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

డిపాజిటర్ల హక్కులు, రక్షణ చర్యలపై అవగాహన

దుగ్గిరాల: పలు రకాల పథకాలు, డిపాజిటర్ల హక్కులు, రక్షణ చర్యలు గురించి, ఆర్బీఐ సహకారంతో సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ (ఆర్డిడ్స్) ఆధ్వర్యంలో దుగ్గిరాల మండల కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎస్.కాళహస్తి ఆర్బీఐ నియమాలు, ప్రభుత్వ పథకాలు, వివిధ రకాల రుణాలు, సబ్సిడీపై రుణాలు, బ్యాంకు ఖాతాల నిర్వహణ వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మరో రిసోర్స్ పర్సన్ ఆర్.ఎస్.శంకర రావు డిపాజిటర్ల హక్కులు, బ్యాకింగ్ మోసాలు, డిజిటల్ మోసాలు, కె.వై.సి. అవసరాలు, పొదుపు ప్రాముఖ్యత తదితరాలను వివరించారు. ఆర్డిడ్స్ కార్యదర్శి యర్రు సాంబశివరావు మాట్లాడుతూ డిపాజిటర్లకు వారి హక్కులు, రక్షణ చర్యల గురించి గ్రామీణస్థాయిలో అవగాహన కల్పించడమే సదస్సు ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఆర్డిడ్స్ రాష్ట్ర సమన్వయకర్త షేక్ హుస్సేన్, ఏపీఎం సురేష్, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎస్.కాళహస్తి

డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం



ప్రతిజ్ఞ చేస్తున్న ఈగల్ టీమ్ డీఎస్పీ సింగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఈగల్ టీమ్ డీఎస్పీ సింగయ్య

మంగళగిరి: డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే తమ లక్ష్యమని ఈగల్ టీమ్ డీఎస్పీ సింగయ్య తెలిపారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలులో శనివారం డ్రగ్స్ వినియోగం వలన జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈగల్ టీమ్ డీఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో తమ జీవితాలను, భవిష్యత్తును పాడుచేసుకోవద్దని యువతకు సూచించారు. సరదాగా స్నేహితులతో కలిసి డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. డ్రగ్స్ వినియోగం వలన ఆరోగ్యంతో పాటు జీవితం, భవిష్యత్తు సర్వస్వం కోల్పోతామనే విషయాన్ని యువత గ్రహించి భవిష్యత్తును కాపాడుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ జోలికి వెళ్లమని ప్రతిజ్ఞ చేయించారు. సీఐ రాంబాబు, పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఇరుపక్షాలకు మేలు

అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు చెప్పారు. తెనాలి కొల్లపేటలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీ కాదగిన కేసులను పరిష్కరిస్తారని, దీని వలన కక్షిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. జూలై 5న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. 5వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. 2020–2021లో వచ్చిన కోవిడ్ ప్యాండమిక్ కారణంగా ఎన్నో కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయని, న్యాయమూర్తులకూ పనిభారం ఉందని న్యాయమూర్తులు తెలిపారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) ఎం. శ్రీధర్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) ఆకా పవన్ కుమార్, 1వ అదనపు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) పి. వివేక్ వర్ధన్, 2వ అదనపు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) పి. రాజశేఖర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తులు

గంజాయితో యువత నష్టపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోంది

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ కుమార్

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మాఫియా వల్ల యువత నష్టపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి రూరల్ మండలం ప్రాతూరులోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పరిస్థితులు కంచే చేను మేస్తోందన్న చందంగా ఉందని, పోలీస్ శాఖలోని కొన్ని కలుపుమొక్కల వల్ల డ్రగ్స్, గంజాయి మాఫియా విస్తరించి యువత జీవితాలను నాశనం చేస్తోందన్నారు. దీనికి నిదర్శనమే రాజమండ్రిలో ఇద్దరు పోలీస్ అధికారుల ఫోన్ సంభాషణ అని పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో అమాయకులను ఇరికించి లెక్కలు చూపించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలియజేశారు. గంజాయి కేసుల్లో అమాయకులను బలిచేసి రూ.కోట్లు సంపాదనే ధ్యేయంగా స్కెచ్ వేసినట్లు తెలియజేశారు. బొమ్మూరు సీఐ లక్ష్మణరెడ్డి, రాజానగరం సీఐ సుభాష్‌లమధ్య జరిగిన సంభాషణ సంచలనం రేపుతోందని తెలిపారు.

- ఒక వైపు రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జరుగుతుంటే అమాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని విమర్శించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే గంజాయి మత్తులో తెలుగుదేశం కార్యకర్తలు కొట్టుకున్న పరిస్థితి ఉందని విమర్శించారు. లిక్కర్ స్కామ్ అంటూ హడావిడి చేస్తున్న ప్రభుత్వం అంతకు మించిన స్థాయిలో గంజాయి వ్యాపారం జరుగుతుంటే ఏంచేస్తోందని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వంవెంటనే విచారణ చేపట్టాలని, జ్యుడీషియల్ ఎంక్వైరీ వేసి నిజనిజాలు తేల్చాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఈవెంట్లు, స్టేట్‌మెంట్లకే పరిమితం అవుతోంది తప్ప ప్రజా సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. రెవిన్యూ ఇంటెలిజెన్స్ నార్కోటిక్ బ్యూరో గంజాయి స్మగ్లింగ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు నివేదిక ఇచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం పరువుపోయినట్లు కాదా అని అన్నారు. సచివాలయ వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి ఎలిమెంటరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతలు స్టేషనరీని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లంకపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ కుంచనపల్లి గ్రామానికి చెందిన కొండా శ్రీనివాసరెడ్డి (అల్లం), వాణి ప్రసన్న దంపతులు వారి తల్లిదండ్రులు కొండా సుబ్బారెడ్డి సుబ్బమ్మ జ్ఞాపకార్థం 150 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ వస్తువులను అందజేశారని తెలిపారు. వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగేశ్వరరావు, సీపీఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మిరియాల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డం తాతారావు, బిరుదుగడ్డ విజయేందర్ రావు, కూరపాటి సాంబిరెడ్డి, చాగంటి సాంబిరెడ్డి, కమ్మిశెట్టి నాగేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సుధా రత్నకుమారి, లాల్ అహ్మద్, సృజన తదితరులు పాల్గొన్నారు.

వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ హైస్కూల్‌లో..



విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ అందజేస్తున్న కొండా శ్రీనివాసరెడ్డి

మంగళగిరి టౌన్: ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ పాలక మండలి సభ్యురాలు జానకీదేవి, పాఠశాల చైర్మన్ వంగర హనుమాన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

207వ రోజుకు చేరిన దీక్షలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శనివారంతో 207వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వేముల దుర్గారావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. నాయకులు సుభాని, ఆశీర్వాదం, సాంబశివరావు, సుబ్బారావు, గురవయ్య, తుపాకుల నాగేశ్వరరావు, హగ్గయ్య, కార్మికులు రమణమ్మ, కాసమ్మ, ఎం.శారద, సువర్ణకుమారి, బేబీ సరోజనమ్మ పాల్గొన్నారు.

‘చలపతి’లో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ భారత్

తాడికొండ: శనివారం మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం బీ–ఫార్మసీ విద్యార్థులు స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఔషధ మొక్కలు నాటి మెడిసినల్ గార్డెన్ ఏర్పాటు చేశారు. చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నాదెండ్ల వెంకట రామారావులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో స్వచ్ఛత, మొక్కల ప్రాముఖ్యతపై తెలియజేసి పర్యావరణాన్ని కాపాడటంలో తమవంతు చేయూత అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేస్తున్న మోతడక చలపతి ఫార్మసీ విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తెనాలి నుంచి కొల్లిపరకు వస్తున్న ఆర్టీసీ బస్సు దావులూరు అడ్డరోడ్డు కార్నర్లో ఆగి ఉన్న ట్రాక్టను ఢీ కొట్టింది. అయితే ట్రాక్టర్ గేరులో ఉండటంతో ఇంజన్ స్టార్ట్ అయి ఎదురుగా ఉన్న ఎక్సెల్ పై ఉన్న వ్యక్తిని ఢీకొని, అనంతరం రెండు ఆటోలను ఒక ఆటోలో ఉన్న వ్యక్తిని కూడా ఢీ కొట్టి కొంత దూరం ఆటోను దారి వెంట ఈడుచుకుంటూ వెళ్లి ఒక గోడకు గుద్దుకుని ఆగిపోయింది. స్థానికులు స్పందించి వెంటనే 108 కి కాల్‌చేసి గాయాలైన ఇద్దరు వ్యక్తులను తెనాలి వైద్య తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.కోటేశ్వరరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



తెనాలిరూరల్: అప్పుల బాధతో బంగారు భరణాల తయారీ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శనివారం రాత్రి తెనాలిలో చోటుచేసుకుంది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన దామర్ల హరిరామకృష్ణ బంగారు ఆభరణాల తయారీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పనులు లేక అప్పుల పాలైన అతను గతంలో ఐపీ దాఖలు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తుండడం, అప్పు ఏసుబాబు ఇంటి మీదకు వచ్చి అల్లరి చేస్తుండడంతో మనస్థాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు. బాధితుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.